



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరవణ

నిబంధనలు పాటించాల్సిందే..

» టారిఫ్ ప్రకారమే డబ్బు తీసుకోవాలి
» డయాగ్నోస్టిక్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి
» డీఎం అండ్ హెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో వెంకటరవణ ఆదేశాలు జారీ చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దగా'ఖానాలు, నిర్ధారణ పరీక్షల పేరుతో దోపిడీ అనే కథనానికి స్పందించిన వైద్యాధికారులు పట్టణంలోని ఆదిత్య న్యూరో, మిషన్ ఆసుపత్రి, మిగితా ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులను పిలిచి మాట్లాడారు. ఆసుపత్రిలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని.. ఆరోగ్యశాఖ అధికారికి సమర్పించిన టారిఫ్ ప్రకారమే బిల్లులు తీసుకోవాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. రోగులకు వారి అటెండెంట్‌లకు అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని, లేనిపక్షంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం జరిమానా విధిస్తూ క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డీడీఎంహెచ్‌వో జీవరాజు, డిప్యూటీ డెమో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరం

ఇదిలా ఉంటే, ఆసుపత్రులపై దినపత్రికల్లో వచ్చే వార్తలపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నిజానిజాలు తెలుస్తాయని.. కార్యాలయాల్లో సమావేశాలు పెట్టి నచ్చజెబితే లాభం లేదని ప్రజలు భావిస్తున్నారు. కార్యాలయాల్లో ఏర్పాటుచేసే సమావేశాలకు.. వారు చూపించే ఆధారాలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, క్షేత్రస్థాయిలో ప్రతీ ఆసుపత్రి, క్లినిక్, మెడికల్, డయాగ్నోస్టిక్ సెంటర్లను పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో మొదటగా డయాగ్నోస్టిక్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. పేదవాడి డబ్బులు రోగనిర్ధారణ పరీక్షలకే సగం పోతున్నాయని మండిపడుతున్నారు. ఇకపై అధికారులు కేవలం సమావేశాలతో ఊరుకుంటారా.. లేక క్షేత్రస్థాయిలోకి నిజానిజాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటారో వేచి చూడాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అలనాటి రాజరిక పాలనకు సాక్షీభూతంగా రాచకొండ ఖిలా నిలుస్తుందని చెప్పవచ్చు. రాచకొండను రాజధానిగా చేసుకుని గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. అలనాడు సింహభూపాలుడు నిర్మించిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఇంకా కనుచూపుమేరలో కనిపించే కొండకోనలు, నీటి పరవళ్లు, నిండైన చెట్లు చేమలతో పరుచుకుని పచ్చటి హొయలతో నిండి సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని కట్టిపడేస్తుంది. రాచకొండ పర్యాటకులు వీక్షించాల్సిన ప్రదేశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.



రాజదర్పం

Sunday Special

రాచకొండ

సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు

శత్రుదుర్భేద్యమైన రాతి కోటగోడ
ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం
అంతుచిక్కని సంకెళ్ల బావి రహస్యం
నేటికీ భక్తులతో కళకళలాడుతున్న ఆలయాలు
రాచకొండ పర్యాటకంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం



అంతఃపురం ముఖద్వారం

ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్ నుంచి రాచకొండ కోటకు చేరుకోవాలంటే నాగార్జున సాగర్ హైవే దగ్గరి దారి. హైదరాబాద్ నుంచి సాగర్ హైవేలో 20 కిలో మీటర్ల వెళ్తే ఇబ్రహీంపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణించాక మంచాల మండల కేంద్రం వస్తుంది. ఇక్కడి కరెంటు జంక్షన్ మూలమలుపు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలోని తిప్పాయగూడ దాటాలి. అక్కడి నుంచి నేరుగా మరో 2 కిలోమీటర్ల తదుపరి సందర్శకులు రాచకొండ కోటకు చేరుకుంటారు.

మంచాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 14వ శతాబ్దంలో రాచకొండ ప్రాంతాన్ని పాలించిన పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల సింహభూపాలుడు రాచకొండ కోటను నిర్మించాడు. ఈ సామ్రాజ్యాన్ని మొదటగా కాకతీయులు, పద్మనాయక వంశీయులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు తదుపరి నిజాం నవాబులు పాలించారు. కాగా పద్మనాయక వంశపాలకుల సమయమే రాచకొండకు స్వర్ణయుగమని పిలుస్తారు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం నిర్మించారు. వందల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ అంతఃపురం చుట్టూ రాతితో

మిగతా 7వ పేజీలో...

అభ్యసనతోనే జ్ఞానం

» ఎస్పీ నారాయణరెడ్డి
» ఏఆర్ పోలీసు అధికారులకు 'మొబిలైజేషన్'

వికారాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానం వయస్సు నుంచి రాదని, విద్య, అభ్యసనం ద్వారా వస్తుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం పరేడ్‌గ్రౌండ్‌లో మొబిలైజేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ప్రాథమికంగా ఇచ్చిన శిక్షణ, నిర్వర్తించాల్సిన విధుల్లో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులు గురించి పోలీస్ మాన్యువల్‌లో ఉన్న విధంగా పాటించాలన్నారు. తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించేందుకు.. పోలీస్ అధికారుల్లో నూతనోత్తేజం తీసుకురావడానికి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులకు మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమం ప్రతీ సంవత్సరం 15 రోజుల పాటు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏఆర్ పోలీసు అధికారులకు ప్రాథమిక శిక్షణ(బేసిక్ ట్రైనింగ్)లో శిక్షణ ఇచ్చినటువంటి పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మోబ్ ఆపరేషన్ డ్రిల్, ఇండోర్ తరగతులు మొదలగు అంశాల పట్ల ప్రతి సంవత్సరం 15 రోజుల పాటు అన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని, ప్రాథమిక శిక్షణలో నేర్చుకున్న విషయాలను మళ్లీ గుర్తు చేసుకోవాలని, పోలీస్ అధికారులు నిరంతరం ఏదైనా కొత్త విషయాలను నేర్చుకొనే అలవాటను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతీ పోలీస్ అధికారి క్రమశిక్షణతో ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శాంతి భద్రతల రక్షణలో తమవంతు పాత్ర పోషించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ టి.హన్మంత్‌రావు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్‌ఐలు డేవిడ్, అంజాత్ పాషా, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అధిగమించేలా..!

ఉమ్మడి జిల్లాలో ముందస్తు కార్యాచరణ



చేవెళ్లలో కొనసాగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులు



నీటి కటకట లేకుండా చూడాలని కలెక్టర్ల ఆదేశం
ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షలు
వేసవికి ముందే పైప్‌లైన్ల మరమ్మతులకు చర్యలు
నీటి సమస్య ఉన్నచోట బోర్లు, ట్యాంకర్లతో సరఫరా
తాండూరు కాగ్నా నది నుంచి నీటి సరఫరాకు ప్రణాళికలు

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శరవేగంగా విస్తరిస్తోంది. జనాభాతోపాటు నీటి వినియోగం కూడా పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. రాబోయే వేసవిలో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులతో కలెక్టర్లు సమీక్షలు నిర్వహిస్తున్నారు. నీటి కటకట ఏర్పడకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నీటి సమస్య అధికంగా ఉన్నచోట బోర్లు, ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 28 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు,

మిగతా 7వ పేజీలో...

'జీనోమ్ వ్యాలీ' రోడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన

వివరాలు తెలుసుకున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బయోటెక్ హబ్‌కు రాకపోకలు సాగించేలా దూరభారాన్ని తగ్గించేందుకు ప్రజాయ్ వాటర్‌ఫ్రంట్ వెంచర్ మీదుగా స్థలాన్ని సేకరించి రోడ్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ), పరిశ్రమల యజమానులు కలెక్టర్‌కు గౌతమ్‌ను కోరారు. శనివారం శామీర్‌పేట మండలం తుర్కపల్లి సమీపంలో గల జీనోమ్‌వ్యాలీ బయోటెక్ హబ్ రూట్ వద్దకు కలెక్టర్ విచ్చేసి రోడ్డు ఏర్పాటుకు సేకరించనున్న స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని మురహరిపల్లి గ్రామ పరిధిలో గల అగస్త్య ఆగ్రో కంపెనీ నుంచి ప్రజాయ్ వాటర్‌ఫ్రంట్ వెంచర్ మీదుగా జీనోమ్‌వ్యాలీ బయోటెక్ పరిశ్రమల్లోకి కొత్తగా రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటుచేసి దూరభారాన్ని తగ్గించాలని టీఎస్‌ఐఐసీ, పరిశ్రమల యజమానులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈమేరకు బయోటెక్ పరిశ్రమల్లోకి దగ్గరగా వెళ్లేందుకై కొత్తగా ఏర్పాటు చేయనున్న రోడ్డు కోసం సేకరించే స్థలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అలాగే ఆ రోడ్డు కోసం మురహరిపల్లి గ్రామస్తుల అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, ఆర్ఐ, పలువురు అధికారులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

కీసర : కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మేడ్చల్, ఖైరతాబాద్, అంబర్‌పేటలకు సంబంధించి భోగారంలోని మహాత్మ జ్యోతిపూలే బీసీ వేల్ఫేర్ రెసిడెన్షియల్(బాలుర) పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించి పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ తెలిపారు. భోజనశాలలో విద్యార్థులకు సరిపడా బెంచ్‌లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో, కళాశాలలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, యజమానికి ఇచ్చే అద్దెలో వాయిదాల ప్రకారం మినహాయించాలన్నారు. వంటశాల, స్టోర్ రూంలలో కలియతిరిగారు. కూరగాయలు, ఇతర సామగ్రిని తడి లేకుండా చూసుకోవాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల, కళాశాలలో మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉన్నారని.. కళాశాలలో ఏఏ గ్రూపులు ఉన్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా జేఈఈలో ఫస్ట్‌ఫేజ్‌లో 89 శాతం మార్కులు సాధించిన కె.తరుణ్‌ను కలెక్టర్ అభినందించి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను.. చేయూత అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

» రూ.9.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్
» ఖాతా బుక్‌లు అందజేసిన కలెక్టర్



పిల్లలకు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన ఇద్దరు అనాథ చిన్నారులకు ప్రభుత్వం అందజేసిన రూ.9.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా పుస్తకాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం కలెక్టరేట్‌లో అందజేశారు. కాగా, 2017లో పిడుగుపాటుకు గురై తల్లి గోవిందమ్మ, తండ్రి వెంకటప్ప మృతిచెందగా వారి పిల్లలు పవన్, అర్చన అనాథలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వారికోసం రూ.9.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా తెరిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఈ డిపాజిట్‌పై వచ్చే వడ్డీని చిన్నారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదనంగా కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేసే పథకం ద్వారా ప్రతీనెల రూ.4వేలు కూడా వారి ఖాతాల్లో జమ చేయనున్నారని వివరించారు. పిల్లలు బాగా చదవాలని సూచించి నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డి-సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరి, పిల్లల నాన్నమ్మ బాలమ్మ పాల్గొన్నారు.

'కులగణన సర్వే'కు టోల్‌ఫ్రీ నంబర్

తాండూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 16 నుంచి 28 వరకు నిర్వహించిన కులగణన-2025కి సంబంధించిన సర్వేకు టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటుచేసింది. ఈమేరకు అధికారులు 040-21111111 నంబర్‌ను కేటాయించారు. గతంలో సర్వేలో పాల్గొనని కుటుంబాలు, వ్యక్తులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేస్తే అధికారులు నేరుగా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫోన్లో సంప్రదించాలని, ఫారాలను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. మండలంలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీలో కమిషనర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

ధారూరు ఎస్సై సస్పెండ్

» ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ
» రూ.30వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వేణుగోపాల్ గౌడ్



వేణుగోపాల్ గౌడ్

ధారూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కేసు నుంచి ఓ నిందితుడిని తప్పించటానికి, నిందితులకు స్టేషన్ బెయిల్ మంజూరు కోసం రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ధారూరు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్‌ను మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ సస్పెండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న ఎస్సై ప్రైవేట్ డ్రైవర్ ద్వారా రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ సంఘటనతో ఐజీ ఎస్సైని సస్పెండ్ చేశారు.

కీసరగుట్ట జాతరకు 250 బస్సులు

కీసర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు 250 బస్సులను నడుపుతామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం కీసరగుట్టలోని బస్టాండ్ వద్ద నగరంలోని కుషాయిగూడ డీఎం మహేశ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. మహాశివరాత్రికి 250 బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. కుషాయిగూడ, హకీంపేట, చెంగిచెర్ల, రాణీగంజ్, ఉప్పల్, కంటోన్మెంట్ మొత్తం ఆరు డిపోల నుంచి బస్సులను నడుపుతామన్నారు. జేబీఎస్, నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల నుంచీ నడుపుతామన్నారు. డీఆర్‌ఎం శ్రీనివాస్, భీమారెడ్డి, డీఎంలు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట



సేవాలాల్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

పెద్దేముల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తండాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు చేశారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. జయరాంతండాలో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ ఉత్సవాలకు ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. త్వరలోనే తాండూరులో బంజారా భవన్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దీనికి మరో ఎకరం భూమిని సమకూర్చాలని గిరిజన నాయకులు ధారాసింగ్ కోరారని, అందుకు ఎకరం భూమిని బంజారా భవన్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. యువత సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, ఎ-బ్లాక్ అధ్యక్షులు నర్సిములు, జితేందర్‌రెడ్డి, రియాజ్, బాబుసింగ్ పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ పునః ప్రతిష్ఠాపన

● పూజల్లో పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్



శివాలయ ప్రతిష్ఠాపన పూజల్లో గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు



పూజల్లో పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్

దౌల్తాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకఫస్లాబాద్‌లో శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. కలశం, శివలింగంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు. పూజా కార్యక్రమాలతో గోకఫస్లాబాద్ యావత్తు శివనామస్మరణతో మార్మోగింది. కోటి రూపాయలతో నిర్మించిన శివాలయం పునఃప్రతిష్ఠాపన పూజల్లో కర్ణాటక రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్‌పాటిల్ పాల్గొన్నారు. మంత్రిని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఆర్డినేటర్‌గా రాజశేఖర్



షాద్‌నగర్ అర్బన్ ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్ షాద్‌నగర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా షాద్‌నగర్‌కు చెందిన తమగొండ రాజశేఖర్‌ను నియామకయ్యారు. ఈ మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినపల్లి సంతోష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచే సామాజిక బాధ్యతను అప్పగించడం ఆనందంగా ఉందని రాజశేఖర్ తెలిపారు. సంతోష్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ధర్మబిక్షం జయంతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నేత, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం 103వ జయంతిని శనివారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాములు గౌడ్, డి.యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మబిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గీత పనివారల సంఘం నాయకులు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తలకొండపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం చెన్నారంలోని మల్లప్పగుట్టపై గల ప్రసిద్ధ మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 28 వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు రావాలని శనివారం అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని స్పీకర్ నివాసంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, కమిటీ మెంబర్లు కల్లు పెంటారెడ్డి, శేఖర్ రెడ్డి, దామోదర్‌రెడ్డిలు స్పీకర్‌ను శాలువాలతో సత్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26న నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఆలయ చరిత్ర, భక్తులకు కల్పించిన వసతులపై స్పీకర్‌కు వివరించినట్లు వారు పేర్కొన్నారు. గుట్టపై అద్భుత శిలాసంపదతో ఆలయాన్ని నిర్మించిన నిర్వాహకులను ప్రసాద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకం పాండు, కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు



స్పెక్ ఫెస్టా-2025 లో పాల్గొన్న ప్రతినిధులు

ప్రతీ విద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో రాణించదల్చిన విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని ఐబీఎం డెలివరీ ప్రాజెక్ట్ మేనేజర్ సుకన్తో మహంతి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్పెక్ ఫెస్టా-2025 ఎంటర్‌ప్రెన్యూర్‌ను ఆయన ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సాంకేతిక రంగం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ ఐఓటీ, బ్లాక్‌చైన్, డేటాసైన్స్ సబ్జెక్టుల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలేజి సెక్రటరీ టీవీ.రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజదర్పం రాచకొండ

(ఐదో పేజీ తరువాయి)

కట్టబడిన శత్రుదుర్భేద్యమైన కోటగోడ ఉంది. ఈ ప్రహరీ మొత్తం రాతితో నిర్మించబడి ఉండడం విశేషం. ఒక్కో ముఖద్వారం పరిధిలో ప్రత్యేక నిర్మాణాలు, కొలనులు ఉంటాయి. అంతఃపురం చుట్టూ వేలాది ఎకరాల్లో నిర్మాణాలు, గుళ్ల గోపురాలు నిర్మించబడి ఉన్నాయి. సుమారు 900 ఏళ్ల క్రితం నిర్మించబడ్డ ఈ దేవాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం గమనార్హం.

సంకెళ్లబావిలో నిధినిక్షేపాలు

రాచకొండ కోట అంతఃపురం ఏడు ముఖద్వారాల్లో చివరి ముఖద్వారం దాటగానే సంకెళ్లబావి ఉంటుంది. ఈ సంకెళ్లబావికి ప్రత్యేకత ఉంది. అంత ఎత్తైన ప్రదేశంలోనూ ఈ బావిలో నీటి నిల్వలు ఉండడం విశేషం. పైగా ఈ బావి లోతు అంతు చిక్కనిదిగా ఉంటుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఆనాటి రాజులు తమ నిధి నిక్షేపాలను ఈ బావిలోనే దాచి ఉంచేవారని ప్రసిద్ధి. ఇంకా ఈ బావి నుంచి సొరంగమార్గం తంగెడిపల్లి చెరువుదాకా విస్తరించి ఉంటుందని ప్రచారంలో ఉంది. కొండ కింది భాగంలో స్వయంభు శంభు లింగేశ్వరాలయం ఉంటుంది. దేశంలో మరెక్కడా లేని పరిమాణంలో ఉన్న ఈ శివలింగానికి ప్రత్యేకత ఉంది. ఏటా శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.




కొండ కిందిభాగంలో గల స్వయంభూ శంభులింగేశ్వరస్వామి



సెలయేరు

లక్ష్మీనృసింహస్వామి ఆలయం.. ప్రత్యేకం

రాచకొండ అంతఃపురం కోటలో ఏడు ముఖద్వారాలతో ఒక భాగం కాగా లక్ష్మీనృసింహ స్వామి ఆలయం ఉండే ప్రదేశం మరో భాగం. దీనినే గుర్రాల గుట్టగా పిలుస్తారు. ఈ ప్రదేశం సుమారు వందకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. కొండపైనే ఐదు దశాబ్దాలు దాటినా చెక్కుచెదరని రీతిలో రాతితో నిర్మించబడిన నరసింహస్వామి ఆలయం ఉంటుంది. గుడి సమీపంలోనే గుర్రాలు సేదదీరేందుకు నిర్మించిన పెద్ద కొలను ఉంటుంది. అప్పట్లో ఈ గుర్రాల గుట్ట సైనికుల విడిదిగా కూడా ఉండేదని చెబుతారు.



గుర్రాల గుట్టపై గల నరసింహస్వామి ఆలయం

సేదతీరే బోగని మంచం

రాచకొండ కోట కింది భాగంలో అంతఃపురానికి విస్తరించి ప్రజలు నివసించేందుకు ఏర్పాటుచేయబడ్డ అనేక గ్రామాలు ఉంటాయి. అప్పట్లో ప్రజల నివాసం కోసం రాతితో నిర్మించబడిన ఇళ్లు, తాగునీటి బావులు, వంటకోసం వినియోగించే రాతి రోళ్లు తదితరాలన్నీ ఈ ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తాయి. రాచకొండ కోట, ప్రజల నివాసం సముదాయాల మధ్య నుంచి వాగునీటి సెలయేరు ఎల్లప్పుడూ పారుతూనే ఉంటుంది. ఈ వాగుకు అనుసరించే వర్షాకాలంలో కొండలపైనుంచి జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. ప్రజావాసాల పక్కనే వీరభద్రేశ్వరస్వామి ఆలయంతో పాటు మరిన్ని దేవతామూర్తుల ఆలయాలు ఉంటాయి. ఇప్పటికీ కుటుంబాలతో సహా భక్తులు ఈ ఆలయానికి చేరుకుని వీరభద్రస్వామికి మొక్కులు తీర్చుకుంటారు. ఇదీగాక రాచకొండ కోటకు దక్షిణ ప్రాంతంలో ఉండే గుట్టపై బోగని మంచం అనే రాతి కట్టడం ఉంటుంది. రాజులు అప్పట్లో ఈ బోగని మంచానికి చేరుకుని సేదతీరి వెళ్లేవారని చరిత్రకారులు చెబుతారు.

బిల్లులియ్యకుంటే తాళం వేస్తా!

» 'ఆదర్శ' పాఠశాల వద్ద ఘటన

పెద్దేముల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ భర్త పాఠశాలకు తాళం వేసేందుకు యత్నించిన ఘటన బుద్ధారం పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో వసతులు కల్పించే పనులు చేయించాలని ఆదర్శకమిటీ చైర్‌పర్సన్ స్వరూపకు అధికారులు సూచించారు. ఈ మేరకు ఆమె భర్త శ్రీనివాస్ రూ.2లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వైరింగ్ పనులు చేయించారు. అయితే వాటికి నేటికీ బిల్లు రాలేదని శనివారం పాఠశాలకు తాళం వేసేందుకు వెళ్లాడు. పాఠశాలకు తాళం వేస్తానని అక్కడున్న టీచర్‌కు చెప్పడంతో ఆమె పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడి అలాంటి పనిచేయొద్దని సూచించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



బుద్ధారంలో పాఠశాలకు తాళం వేసేందుకు వచ్చిన శ్రీనివాస్

హోటళ్లపై కమిషనర్ దాడులు

» అపరిశుభ్ర వంటకాలు ఉండడంతో జరిమానా

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలో హోటళ్లు, బేకరీలపై మున్సిపల్ కమిషనర్ యోగేష్ శనివారం దాడులు నిర్వహించారు. పౌల్ట్రీ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతున్న నేపథ్యంలో హోటళ్లు, బేకరీలు, మెస్‌లలో శుభ్రమైన చికెన్ వాడుతున్నారా? లేదా? అని మున్సిపల్ అధికారులు దాడులు చేపడుతున్నారు. పట్టణంలోని ఏడు హోటళ్లు, బేకరీల్లో కమిషనర్ తనిఖీ చేశారు. మసుల్దార్ మండి, పల్లె రుచులు, ఎస్వీఆర్ బేకర్స్ అండ్ హోటళ్లలో పాడైన చికెన్, అల్లం పేస్ట్, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పడేశారు. వంట గదులు అపరిశుభ్రంగా ఉండటంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మసుల్దార్ మండి హోటల్‌కు రూ.30వేలు, పల్లెరుచులు హోటల్‌కు రూ.5వేలు, ఎస్వీఆర్ బేకరీకి రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. వారం రోజుల్లో తనిఖీకి వస్తానని, పద్ధతి మారకుంటే హోటళ్ల లైసెన్స్ రద్దు చేసి సీజ్ చేస్తానని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఆనంద్, వార్డు అధికారులు, శానిటేషన్ జవాన్లు, బిల్ కలెక్టర్లు ఉన్నారు.



ఎస్వీఆర్ బేకరీ యజమానికి జరిమానా విధిస్తున్న కమిషనర్ యోగేష్



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం ఇస్తున్న భూదాన్ రైతులు

భూదాన్ భూములు దక్కేలా సీఎంతో మాట్లాడుతా

» రైతులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ

నందిగామ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భూదాన్ భూములను కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం భూదాన్ రైతులు హైదరాబాద్‌లోని నవచేతన విజ్ఞాన సమితి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం ఇచ్చారు. నందిగామలో 18 మంది పేద రైతులకు 1975లో 99 ఎకరాల భూమిలో భూదాన్ బోర్డు పట్టాలు ఇచ్చిందని, ఆ భూమికి కొందరు తప్పుడు ఆర్వోఆర్‌లు సృష్టించి కబ్జా చేశారని రైతులు వాపోయారు. రైతులకు న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని, నిరుపేదలకు న్యాయం జరిగే వరకు అండగా ఉండి పోరాడుతామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ నాయకులు రవీంద్రచారి, పర్వతాలు, జంగయ్య, రామస్వామి, శేఖర్‌రెడ్డి, రైతులు శ్రీనివాస్, జంగయ్య, పోచయ్య, ప్రవీణ్, రాజు, చంటి ఉన్నారు.

నేటి నుంచి కొనగట్టు శివాలయ జాతర



చేవెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు చేవెళ్లలోని కొనగట్టు శివాలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం తెలిపారు. శనివారం చేవెళ్లలో విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్లలో కొలవైన కొనగట్టు శివాలయంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. 16న గణపతి హోమం, అఖండ దీపారాధన, 17న పునః పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, 18న రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, అలాగే మూడు రోజుల పాటు హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

గ్యారెంటీలను అమలు చేయాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు న్యాలట అశోక్ అన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే సభపోస్టర్‌ను శనివారం చేవెళ్లలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గార్యెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సభకు రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య జంగయ్య, రాఘవేందర్‌రెడ్డి, రామయ్య శేఖర్, దశరథ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అధిగమించేలా..!

(5వ పేజీ తరువాయి)

5 కార్పొరేషన్లు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. 30 వేల జనాభా ఉన్న పరిగి మునిసిపల్ ప్రజలకు రోజూ 3.61 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా, మిషన్ భగీరథ ద్వారా 1.67 ఎంఎల్‌డీ మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. మునిసిపల్ పరిధిలోని 72 బోర్ల ద్వారా ఒక ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. ఒక ఎంఎల్‌డీ నీటి కొరత ఉంది. పరిగి పట్టణంలో ఏర్పాటైన కొత్త కాలనీలకు మిషన్ భగీరథ నీటి సరఫరా లేదు. భవానీనగర్, తిరుమల రెసిడెన్సీ, మైత్రినగర్, శ్రీనివాస హిల్స్, వేంకటేశ్వర, ఆర్టీసీ, ఎస్‌ఆర్‌ఐ, తుంకులగడ్డ కాలనీలకు నల్లా కనెక్షన్లతో నీటి సరఫరా కొనసాగడం లేదు. వికారాబాద్, కొడంగల్ మునిసిపల్ పరిధిలో ఇంకా తాగునీటి ఇబ్బందులు ప్రారంభం కాలేదు. వికారాబాద్ పట్టణ ప్రజలకు రోజూ మిషన్ భగీరథ ద్వారా 13 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరగాల్సి ఉండగా, ప్రస్తుతం 10 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. మున్సిపల్ అధికారులు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ పట్టణ ప్రజలకు ఇంతకు ముందు తాగునీటిని అందించిన శివసాగర్‌లో పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో ఉంది. తాగునీటి సమస్య ఎదురైతే శివసాగర్ నుంచి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పైపులైన్లలో మరమ్మతులకు గురైన ఒక పైపులైన్ మరో వారం రోజుల్లో అందుబాటులోకి రానుంది. ముందు జాగ్రత్తగా 4 వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచారు. అవసరమైతే ఆయా వార్డుల్లోని బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలో 10700 నీటి కనెక్షన్లు ఉన్నాయి. అమృత్ 2.0లో భాగంగా వికారాబాద్ పట్టణంలో రామయ్యగూడ, భృంగీ కాలనీల్లో కొత్త మంచినీటి ట్యాంకుల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. వచ్చే వేసవి నాటికి ఈ ట్యాంకులను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొడంగల్ మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి లేదు. రోజుకు 1.84 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా, ప్రస్తుతం 1.8 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది. మిషన్ భగీరథ నీటి సరఫరా ఏ కారణం వల్లనైనా ఆగిపోతే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఒకవేళ తాగునీటి సమస్య తీవ్రతరం దాలిస్తే మాత్రం తాండూరు కాగ్నా నది నుంచి నీటిని సరఫరా చేసే విధంగా మునిసిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీకి మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా అవుతుంది. పట్టణానికి నీటి తలసరి వినియోగం 1.8 ఎంఎల్‌డీ (18లక్షల లీటర్లు) ఉండగా 1.5 ఎంఎల్‌డీ (15లక్షల లీటర్లు) నిత్యం సరఫరా అవుతుంది. జనాభా పెరగడంతో 0.3 ఎంఎల్‌డీ నీటి సరఫరా అవసరం ఉందని మున్సిపల్ అధికారులు కోరినా మిషన్ భగీరథ అధికారులు నీటిని పెంచడం లేదు. దీని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు బోర్లు, ట్యాంకుల ద్వారా పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మంజీరా నీటిని సరఫరా చేయాలని శంకర్‌పల్లి పట్టణవాసులు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 50వేల వరకు జనాభా ఉంది. రోజుకు 5ఎంఎల్‌డి నీరు అవసరం కాగా మిషన్ భగీరథ ద్వారా 4.45 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నారు. 105 బోర్లు కూడా ఉన్నాయి. ఆమనగల్లు మున్సిపాలిటీ జనాభాకు ప్రతి రోజు2.5 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉంది. మిషన్ భగీరథతో 2మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. మరింత మున్సిపాలిటీకి చెందిన 30బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నీటి సమస్య లేదు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటతో తాగునీటి డిమాండ్ పెరుగుతోంది. గతేడాది ఇదే సమయంలో ఇంతగా డిమాండ్ లేదని అధికారులు చెబుతున్నారు. రోజు విడచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని చోట్ల పైపులైన్లు సరిగా లేక పోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో 3.43 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా ఇందులో హెచ్ఎం డబ్ల్యు ద్వారా 2.5 మిలియన్ లీటర్లు, మిషన్ భగీరథ ద్వారా 0.53 మిలలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య రాకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీలో 25 వేల జనాభాకు రోజుకు ఎంఎల్‌డి నీటిని సరఫరా చేస్తున్నారు. నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. 110 బోర్లు పనిచేస్తున్నాయి. చేవెళ్ల మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. 2,322 లక్షల లీటర్లు సరఫరా చేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటిలలో 4 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతుంది. నీటి సమస్య ఇంకా తలెత్తలేదు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 4.5 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వాటర్ ట్యాంకర్లు ఉండగా అదనంగా మరో 8 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఆరు ఓవర్ హెడ్ పంపులు ఉన్నాయి. వేసవి గడిచేంత వరకుప్రత్యేకంగా మంచినీరు సరఫరా కోసం 17 మంది సిబ్బందిని నియమించారు. రోజు తప్పించి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. ఒక ఓవర్‌హెడ్ ట్యాంకు, 40 బోర్లను సిద్ధం చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 3.7 మిలియన్ లీటర్ల నీటి సరఫరా చేస్తున్నారు. 26 బోర్లు సిద్ధంగా ఉన్నాయి. ఎనిమిది ట్యాంకులు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను సిద్ధం చేశారు.

'సేవాలాల్' సేవలు చిరస్మరణీయం


మేడ్చల్ టౌన్: సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) అడవి తల్లి ఒడిలో పుట్టి పెరిగిన లంబాడా, గిరిజనులకు సేవాలాల్ మహారాజ్ అందించిన సేవలు చిరస్మరణీయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని రాజబొల్లారం తండాలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకల్లో శనివారం ఆయన పాల్గొని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజనుల హక్కులు కాపాడటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, మల్లికార్జున్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో బంజార భవన నిర్మాణానికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సేవాలాల్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని దీప్లానాయక్ తండాలో శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, భరత్‌కుమార్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్: సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని మండల పరిధిలోని మక్త వెంకటాపూర్ గ్రామంలో గిరిజన సోదరులు ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ జయంతిలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు, అశోక్‌కుమార్, రాందాస్, వెంకట్, రాంచందర్, భీమ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో శనివారం కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, బందయ్య, రాము నాయక్, మహేష్‌రెడ్డి, మాదవ్, శ్రీనివాస్‌గౌడ్, హనుమంత్ నాయక్, వైద్యనాథ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలో సేవాలాల్ జయంతిని శనివారం బంజార సేవాసంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. మండలంలో బంజార భవనానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండునాయక్, గోపాల్‌నాయక్, రమేశ్‌నాయక్, హిర్యానాయక్, జైసింగ్‌నాయక్, చందర్‌నాయక్ పాల్గొన్నారు.

పూడూరు: తర్మలాపూర్ తండాలో సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజనులు తండావాసులంతా ఒక చోట చేరి చిన్నాపెద్దా తేడా లేకుండా బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొడంగల్: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా శనివారం కొడంగల్ నియోజకవర్గంలోని గిరిజన సంఘం నాయకులు, గిరిజన సోదరులు స్థానిక వినాయక చౌరస్తా నుంచి కొడంగల్ పట్టణంలోని బంజార భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆటాపాటలతో, నృత్యాలతో ర్యాలీగా బంజార భవన్‌కు చేరుకున్నారు. అక్కడ శ్రీ సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, శివచౌహన్, శంకర్‌నాయక్, రవినాయక్, రెడ్యానాయక్, డాక్యానాయక్, సంతోష్, రాంచందర్, భానునాయక్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సేవాలాల్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి భూ లక్ష్మమ్మ చౌరస్తాలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

దౌల్తాబాద్: సేవాలాల్ మహారాజ్ జయంతిని మండలంలోని ఎల్‌జీ తండాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్, బలరాం సబావత్, చందర్, నారాయణనాయక్, పాండు, జైల్‌సింగ్ రాజు, శ్రీనివాస్, రవి పాల్గొని గిరిజనులకు సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

దుద్యాల: శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రేటిబండతండాలో భూ పోరాటంలో పలు విషయాల్లో మద్దతు తెలిపిన వివిధ కుల సంఘాల నాయకులను గిరిజనులు సన్మానించారు. గిరిజన మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చాంద్ పాష, బుస్స చంద్రయ్య, సూర్యనాయక్, వెంకటయ్య, రాజునాయక్, సురేశ్‌రాజ్, శివకుమార్ పాల్గొన్నారు.

ధారూరు: సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని పలు గిరిజన తండాలలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మైలారం తండాలు, డీకే తండా, రాంపూర్, పీసీఎం తండా, దోర్నాల్ తండాలో గిరిజనులు సేవాలాల్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం సేవాలాల్ విగ్రహంతో ర్యాలీలు నిర్వహించారు.

మోమిన్‌పేట్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని మండలంలో గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎంపీడీవో కార్యాలయం ర్యాలీ నిర్వహించి సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బంజారాల ఆరాధ్యదైవం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: ఫకీర్‌టెక్యాల్‌లో శనివారం బంజారుల ఆరాధ్యదైవ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని జగదాంబ దేవి సహిత శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో భోగా భండార్ ఘనంగా నిర్వహించారు. బంజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, నానావత్ రూప్‌సింగ్, వడ్యా రాజునాయక్, నానావత్ హుస్సేన్ నాయక్, ఆలయ పూజారి రమావత్ సింగ్‌నాయక్, తండా వాసులు నానావత్ సురేష్‌నాయక్, శివాజీనాయక్ పాల్గొన్నారు.

పెద్దేముల్: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ అన్నారు. జయరాంతండాలో నిర్వహించిన శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ కొండవిశ్వేశ్వర్‌రెడ్డి సూచన మేరకు గిరిజనులకు మిఠాయిలు పంపిణీ చేశారు. గిరిజనులు సొంతూళ్లు వదిలి పూణె, ముంబై వంటి నగరాలకు వలస వెళ్లకుండా వారికి స్థానికంగా ఉపాధి కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణముదిరాజ్, అంతారం లలిత, బంటారం భద్రేశ్వర్ పాల్గొన్నారు.


కులకచర్ల: దీప్లానాయక్ తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మూడుచింతలపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సంత్ సేవాలాల్ జయింతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రవి, గోపి, సొసైటీ డైరెక్టర్లు బహుసింగ్ నాయక్, నర్సింహులు గౌడ్, నాయకులు రాములు నాయక్, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: గిరిజనుల్లో చైతన్యం తీసుకురావడానికి సంత్ సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలు మరువలేనివని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్, మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, నారపల్లిలలో ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిక్కు నాయక్, రెడ్డియా నాయక్, జాదవ్ శేషారావు పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

తాండూరు: పట్టణంలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడువాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా సంపత్, గిరిజన నాయకులు, భూకైలాస్ దేవస్థాన వ్యవస్థాపకులు వాసు పవర్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి బీజేపీ నాయకులు సహపంక్తి భోజనం చేయడంతో పాటు సేవాలాల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, బీజేపీ జిల్లా నాయకులు భద్రేశ్వర్, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.


తాండూరు: సేవాలాల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు

తాండూరు రూరల్: సంకిరెడ్డిపల్లి తండాలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ, గిరిజన నాయకుడు మోహన్‌సింగ్, గిరిజనులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూజారి గోపాల్‌నాయక్, బాబునాయక్, శ్రీరామ్ భద్రునాయక్, కేశ్య గోపాల్ పాల్గొన్నారు.

బషీరాబాద్: సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, వెంకటేష్, రామునాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కుళ్లిపోయిన స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, గుంటిగూడెం ఎరిమల్లెవాగులో గుర్తుతెలియని మృతదేహాన్ని(వయస్సు సుమారు 45) గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని వాగులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు తెల్లటి బనియన్ ధరించి ఉన్నాడని, మూడు నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అచూకీ తెలిస్తే 8712662178, 8712662184, 8712662705 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందగా ప్రయాణికులు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కాగా మృతదేహంపై గాయాలుండటంతో మద్యం మత్తులో కిందపడి మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యాడారం గ్రామానికి చెందిన లలిత(38) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. హాస్టల్ క్యాంటీన్‌లో భోజనం విషయంలో విద్యార్థుల మధ్య జరిగిన వాగ్వాదం వివాదానికి దారితీసింది. విద్యార్థులు తెలిపిన వవరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి హాస్టల్‌కు చెందిన బీటెక్ విద్యార్థి నితిన్‌తో భోజనం విషయంలో సీనియర్ విద్యార్థులు గొడవకు దిగారు. దీంతో నితిన్ తనకు పరిచయమున్న 30 మంది బయటి వారిని పిలిచి సీనియర్లపై దాడి చేయించాడు. దీంతో విద్యార్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా దాడికి పాల్పడిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం దాడిలో గాయపడిన బల్‌వీర్, శ్రీకాంత్, అరుణ్, హరీష్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కందులు, వేరుశనగ బీట్లు

ధారూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం కందులు, వేరుశనగ పంట ఉత్పత్తుల బీట్లు నిర్వహించారు. బీట్లలో కందులు క్వింటాలుకు రూ. 7,300ల నుంచి 7,510ల వరకు , వేరుశనగ క్వింటాలుకు రూ. 5,600ల నుంచి 6,670ల వరకు ధరల పలికాయి. కాగా కందులు 409.5 క్వింటాళ్లు, వేరుశనగ 235.8 క్వింటాళ్ల క్రయ విక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

ఉపాధి కూలీలు దరఖాస్తు చేసుకోవాలి

ధారూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధారూరు పంచాయతీ పరిధిలో వందరోజుల పని పూర్తికాని ఉపాధి కూలీలు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2024 నుంచి 2025 మార్చి31వ తేదీ వరకు 100 రోజుల పని పూర్తి చేయని కూలీ కుటుంబాలకు సోమవారం నుంచి పనులు కల్పిస్తామని చెప్పారు. అవసరమున్న రైతులు పట్టాదారుపాసుపుస్తకం జిరాక్సు పత్రం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎస్ క్యాబ్ ప్రతినిధుల బృందం


ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్న రవీందర్‌రావు

తాండూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పదవీ కాలం పొడిగింపునకు కృషి చేసిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని టీఎస్ క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు, వైస్‌చైర్మన్ సత్తయ్య, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, పలు జిల్లాల డీసీసీబీ చైర్మన్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదవీ కాలం పొడిగింపుతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం దక్కుతుందని ఈ బృందం అభిప్రాయపడింది.

గ్రామానికి చెత్త తీసుకురావొద్దు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీలోని వివిధ గ్రామాల చెత్తను తమ గ్రామానికి తీసుకొచ్చి కాల్చొద్దని కొర్రెముల గ్రామస్తులు చెత్త వాహనాలు రాకుండా రోడ్డుపై ముళ్ల కంపను వేశారు. రోజుకు పదుల సంఖ్యలో చెత్త ట్రాక్టర్లు తమ పొలాల సమీపంలో డంపింగ్ చేసి కాల్చడం వల్ల పొలాలు, తాటి చెట్లు దెబ్బతినడమే కాకుండా వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిగోటా మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్‌పీలు రమేష్ నాయక్, శ్రీనివాస్ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎస్ఏల ఉద్యోగ సంఘం మహిళా అధ్యక్షురాలు ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

మోమిన్‌పేట్: మెదక్ జిల్లాలో శుక్రవారం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్, ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు సీఆర్‌పీలు మృతి చెందడం బాధాకరమని సీఆర్‌పీల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఆర్‌పీలకు ఇన్సూరెన్స్ ప్రమాదబీమా తదితర సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

కొనసాగుతున్న బండెల ఎల్లమ్మ జాతర


బండెల ఎల్లమ్మ దేవతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డులో వెలిసిన బండెల ఎల్లమ్మ దేవత జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం సిడె కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. రెండో రోజు రథోత్సవం కనుల పండవగా కొనసాగింది. ఉత్సవాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఆదివారం పెరుగు బసంతం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరణ

హరితసేన జిల్లా ఇన్‌చార్జి ఎరన్‌పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం కొడంగల్‌లో గ్రీన్ ఇండియా చాలెంజ్, వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 17వ తేదీన మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ రూపకర్త మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ పిలుపు మేరకు వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సుతారిగూడలో వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ సమస్య పరిష్కారానికి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. గ్రామ పరిధిలోని కొన్ని వ్యవసాయ పొలాల వద్ద లోఓల్టేజీ కారణంగా బోరు మోటార్లు సరిగా నడవని కారణంగా పొలాలకు నీరందించలేకపోతున్నామని స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానికులు వెంకటేశ్ ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆధునిక ప్రాజెక్టులపై దృష్టి సారించాలి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బాల విఘ్నేష్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక ప్రాజెక్టులపై దృష్టి సారించాలని పవర్ బీఐ రిసోర్స్ పర్సన్ బాల విఘ్నేష్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం డేటా ఇల్యూమినరీస్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన డేటా విశ్లేషణ, డేటా విజువలైజేషన్, డాష్‌బోర్డు, డిజైనింగ్‌లపై విద్యార్థులకు వివరించారు. ఆధునిక డేటా అనలిటిక్ టూల్స్, రియల్ టైమ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తండ్రి సమాధి వద్ద మాజీ మంత్రి నివాళి

వికారాబాద్: మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేకర్ తన తండ్రి 25వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులతో నివాళులర్పించారు. మర్పల్లి మండల కేంద్రంలోని ఆయన ఫౌంహౌస్‌లో తన తండ్రి బాలయ్యకు నివాళులర్పించారు. ఆయన వెంట కుటుంబసభ్యులు ప్రమీల చంద్రశేఖర్, కూతుళ్లు, కుమారులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వికారాబాద్: తెలంగాణ ఉద్యమ కారుడు బీఆర్ఎస్ నాయకుడు మంచన్‌పల్లి సురేష్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పరామర్శించారు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లిన ఆనంద్ సురేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దోమ: గుండాలలో పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి రూ.50వేలు శనివారం విరాళం అందజేశారు. దాతలు విరాళాలు ఇవ్వడం సంతోషకరమని ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో అంజిలయ్య, శ్రీను, అంజిలయ్య, దస్తయ్య, అంజిలయ్య, లాలయ్య, వెంకటేష్, రామయ్య, అంజిలమ్మ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలి

పెద్దేముల్: బీసీ ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. గొట్లపల్లి గ్రామానికి చెందిన బంగారు నవీన్‌కుమార్‌ను బీసీ యువజనసంఘం అధ్యక్షుడిగా నియమించారు. అందుకు సంబంధించిన నియామకపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ప్రతిగ్రామానికి ఉద్యమాన్ని తీసుకుపోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ శుకూర్, మండల అధ్యక్షుడు రేగొండి శ్రవణ్‌కుమార్, యాలాటి శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో క్రికెట్ కోచ్ మృతి

కీసర రూరల్: గుండెపోటుతో క్రికెట్ కోచ్ మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహారాష్ట్ర, కోల్హాపూర్‌కు చెందిన ఎ.తిరువెంకటాచారి(60) పూణే క్రికెట్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. రాంపల్లి సమీపంలోని ఓ క్రికెట్ మైదానంలో శనివారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన పాల్గొన్నారు. ఆకస్మాత్తుగా ఆయనకు చాతీలో నొప్పి రావడంతో అపస్మారకస్థితిలో కింద పడిపోయాడు. క్రీడాకారులు కోచ్‌ను వెంటనే అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోచ్ తిరువెంకటాచారి గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాలాల ఎంఈవోగా రమేష్


ఎంఈవో రమేష్

యాలాల, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): యాలాల మండల విద్యాధికారిగా జుంటుపల్లి జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న డి.రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాదికారులు డి.రమేష్‌ను యాలాల మండల ఎంఈవోగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ పని చేసిన ఎంఈవో సుధాకర్‌రెడ్డి గతనెల 31వ తేదీన పదవీ విరమణ పొందారు. దీంతో మండలానికి నూతన విద్యాధికారిగా రమేష్‌ను నియమించారు. రమేష్ నియామకం పట్ల మండల పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


అంతమ్మను పరామర్శిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగాఉంటామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శివారెడ్డిపేటలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన అంతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెకు ఇందిరమ్మఇల్లు, నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తామన్నారు. అక్కడి నుంచే తహసీల్దార్ లక్ష్మీనారాయణతో మాట్లాడారు. అనంతరం టేకులబీడు తండాకు చెందిన నేనావత్ దేవేందర్ విద్యార్థి కుల్కచర్ల హాస్టల్‌లో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి 5వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా గంగారంలో ఇటీవల ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబాన్ని రాజీవ్ నగర్‌లో గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మునీర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్యానాయక్, మురళి, వేణుగోపాల్‌రెడ్డి, ఆసిఫ్, మధు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ శివలీల

యాలాల, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాపై అవగాహన అవసరమని తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ శివలీల సూచించారు. మండల పరిధిలోని అగ్గనూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకోరాదని, రోడ్ సేఫ్టీ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేష్, యాలాల ఎస్ఐ గిరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రామాలయంలో ఆర్టీఏ సభ్యుడికి సన్మానం


జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌కు చెందిన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ భీమిడి జైపాల్‌రెడ్డిని రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడిగా నూతనంగా నియమించింది. ఈ సందర్భంగా శనివారం దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలోకి ఆర్టీఏ నూతన సభ్యుడు జైపాల్‌రెడ్డిని ఘన స్వాగతం పలుకుతూ ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు వలందాస్ మురళీగౌడ్, హరికృష్ణ, సంజీవరెడ్డి, జగదీశ్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యకదర్శి ప్రవీణ్, మున్సిపల్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు వజ్జల శశాంత్, కట్ట శ్రీకాంత్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బషీరాబాద్ విద్యాధికారిగా రాములు


దూస రాములు

బషీరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల విద్యాధికారిగా దూస రాములు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలోని మంతట్టి జడ్పీ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయనకు ఎఫ్‌ఏసీ విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. సోమవారం విద్యాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకు ముందు ఇక్కడి విద్యాధికారిగా పని చేసిన సుధాకర్‌రెడ్డి గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. మండల విద్యాధికారిగా దూస రాములు నియామకంతో మండల పీఆర్టీయూటీఎస్, టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నర్సింహారెడ్డి, ఎం.రవీందర్, ఎస్.రవికుమార్, వెంకటప్పలు స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.

ఐదుగురు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలంలో మరో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. చెంగోల్‌లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోష బషీరాబాద్‌కు బదిలీ కాగా, చిట్టిఘనాపూర్ కార్యదర్శి నవిత గోనూరుకు బదిలీ అయ్యారు. సంకిరెడ్డిపల్లిలో పనిచేస్తున్న శిరీష చిట్టిఘనాపూర్‌కు బదిలీ అయ్యారు. కోటబాస్పల్లిలో పనిచేస్తున్న లాలప్ప పెద్దేముల్‌కు బదిలీ అయ్యారు. గోనూరులో పనిచేస్తున్న రషీద్‌పాషా బదిలీకాగా, పోస్టింగ్ ఇంకా ఇవ్వలేదని ఎంపీడీవో తెలిపారు. ఇటీవలే పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసిన విషయం విధితమే.